TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 90 | పేజీలు : 04| వెల: రూ.3/-

తెలంగాణ

బుధవారం | అక్టోబర్ 28, 2026

రక్తదానం ప్రాణదానంతో సమానం

- వరంగల్ సీపీ ఎన్.శ్వేత
- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం
- రెడ్‌క్రాస్ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ
- స్వయంగా రక్తదానం చేసిన సీపీ శ్వేత


2లో..

జవహర్ నగర్ డంప్ యార్డు తొలగించే వరకు పోరాటం ఆపేది లేదు

- ఎంపీ ఈటల రాజేందర్
- ఎదులాబాద్ బహిరంగ సభలో తీవ్ర ఆగ్రహం
- రూ.3 వేల కోట్లతో డీపీఆర్ తయారు చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి


4లో..



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఎదులాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ పాదయాత్ర ప్రారంభ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత 12 ఏళ్లుగా స్థానిక ప్రజలు జెఎసిగా ఏర్పడి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారని, నిబంధనలు పాటించనందుకు సుప్రీంకోర్టు రూ. లక్ష ఫైన్ కూడా వేసిందని ఈటల గుర్తుచేశారు. “గతంలో ఇక్కడ ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఎన్జీటీ, సుప్రీంకోర్టుల్లో కేసులు వేశారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించాం. కానీ రెండేళ్లయినా ఎలాంటి స్పందన లేదు” అని విమర్శించారు. ఈ డంప్ యార్డు వ్యవహారాన్ని తాను పార్లమెంటులో లేవనెత్తడమే కాకుండా, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ వ్యతిరేకతను ఓటుగా మలచాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం
- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రుల హాజరు
- ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించాలని పిలుపు



నాగార్జునసాగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో నాగార్జునసాగర్‌లో నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో కీలక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జి బూడిద బిక్షంగౌడ్‌లతో కలిసి రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్న తరుణంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి అర్హులైన పట్టభద్రుడినీ గుర్తించి, వారిని ఓటరుగా నమోదు చేయించేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో తీవ్రంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సెలవు లేకుండా నిరంతరం ప్రజా సేవలో నిలిచేది పోలీసు శాఖే

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సామాజిక సేవలో ముందంజ


2లో..

గురు రాందాస్ జీ ఆశయాలు ఆదర్శప్రాయం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్

రహమత్ నగర్‌లో శ్రీ గురు రాందాస్ జీ 492వ జయంతి వేడుకలు


4లో..

డిజిటల్ పద్ధతిలో సమగ్ర శిక్షణ

- ఛార్జ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం
- జీహెచ్ఎంసీ సర్కిళ్లు 31 నుంచి 60 పరిధిలోని అధికారులకు అవగాహన
- నాణ్యత, కచ్చితత్వంతో జనగణన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం


4లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, అక్టోబర్ 28, 2026

రక్తదానం ప్రాణదానంతో సమానం

వరంగల్ సీపీ ఎన్.శ్వేత

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

రెడ్‌క్రాస్ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ

స్వయంగా రక్తదానం చేసిన సీపీ శ్వేత



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో బృహత్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడంతో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలిచి సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లోనూ, ప్రమాదాల్లోనూ చిక్కుకున్న బాధితులకు రక్తదానం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చునని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ తమ సామాజిక బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి.శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్రలతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు, జిల్లా పాలకమండలి సభ్యులు కె.రాకేష్ రావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు హాజరయ్యారు.

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

- **పద్మశాలీ సమాజం డిమాండ్**
- **కొండా లక్ష్మణ్ బాపూజీకి 'భారతరత్న' ఇవ్వాలి**
- **వరంగల్ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి**



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని, ఆయన ఈ పదవికి పూర్తిగా అర్హుడని పద్మశాలీ సమాజం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రొఫెసర్ భాస్కర్ సేవలు కేవలం పద్మశాలీ కులస్థులకే కాకుండా యావత్ తెలంగాణ సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు మేధావులు, సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు.

లక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకంలో సామాజిక సేవ

1986లోనే ఆచార్య గడ్డం భాస్కర్ మామగారైన మామిడి లక్ష్మీనారాయణ (కొండా లక్ష్మణ్ బాపూజీకి అత్యంత సన్నిహితులు) ద్వారా బాపూజీతో పరిచయం ఏర్పడింది. బాపూజీ మంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు మామిడి లక్ష్మీనారాయణ పీఎస్‌గా సేవలందించారు. ఈ నేపథ్యంలో ఆయన మార్గదర్శకత్వంలో చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై గడ్డం భాస్కర్ రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు 1986లోనే 'తెలుగు అకాడమీ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. అనంతరం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశీస్సులతో 1996 నుంచి 2002 వరకు 'వరంగల్ పోపా' అధ్యక్షునిగా భాస్కర్ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో పద్మశాలీ సమాజ వికాసానికి, ప్రతిభావంతులైన విద్యార్థులకు, వ్యాపారవేత్తలకు, ఉద్యోగులకు మధ్య అనుసంధానంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అలాగే ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సులు, మహిళా సదస్సులు, క్రీడా పోటీలు, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సమాజానికి విశేష సేవలందించారు.

బాపూజీకి 'భారతరత్న' ఇవ్వాలి

నేటి విద్యాసంస్థల్లో చేనేత దినోత్సవాలను, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పండుగలా నిర్వహించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా 1947 నుంచి గాంధీజీ బాటలో నడిచి, రజాకార్ల అగడాలకు వ్యతిరేకంగా సాయుధ దళాలను ఏర్పాటు చేసి పోరాడిన గొప్ప యోధుడు బాపూజీ అని కొనియాడారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవికి సైతం రాజీనామా చేసి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే వరకు ఏ పదవినీ తీసుకోని నిస్వార్థ నాయకుడని గుర్తుచేశారు. మలిదశ ఉద్యమంలో తన నివాసమైన 'జలదృశ్యం'ను ఉద్యమానికి కేంద్రబిందువుగా ఇచ్చిన దాతృత్వశీలి బాపూజీ అని, చేనేత కార్మికులకు సరైన ఉపాధి కల్పించేందుకు హైకో ను స్థాపించడంతో పాటు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లో వసతి గృహాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇటువంటి మహనీయుడు, సంఘ సంస్కర్త అయిన కొండా లక్ష్మణ్ బాపూజీకి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని, అలాగే వరంగల్‌లో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి 'కొండా లక్ష్మణ్ బాపూజీ విమానాశ్రయం' అని పేరు పెట్టాలని తెలంగాణ ప్రజల తరపున ప్రభుత్వం ముందు ప్రధానంగా డిమాండ్ ఉంచారు.

సెలవు లేకుండా నిరంతరం ప్రజాసేవలో నిలిచేది పోలీసు శాఖే

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **వేములవాడలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం**
- **ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సామాజిక సేవలో ముందంజ**

వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వేములవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో వేములవాడలో మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు దసరా, దీపావళి వంటి పండుగల రోజుల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉంటూ, ఎలాంటి సెలవులు లేకుండా నిరంతరం విధి నిర్వహణలో శ్రమించే ఏకైక శాఖ పోలీసు శాఖ అని కొనియాడారు. నేరాలను అరికట్టడం, చట్ట పరిరక్షణతో పాటు ప్రజల్లో నిరంతరం భద్రతా భావాన్ని, ధైర్యాన్ని కల్పించడంలో పోలీసులు ముందుంటున్నారని తెలిపారు. కేవలం శాంతిభద్రతలకే పరిమితం కాకుండా ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాల వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై యువతకు చైతన్యం తేవడంతో పాటు, మత్తు పదార్థాలకు



బానిసలైన యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి వారి కుటుంబాలకు చేర్చడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుకు సంపూర్ణ మద్దతు లభిస్తోందని వెల్లడించారు. వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పోలీసు అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, వైద్యులు, విలేకరులు, రక్తదాతలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

డాక్టర్ అనితా రెడ్డి

హనుమకొండ జెడ్పీ ఆవరణలోని కేంద్రాన్ని పరిశీలించిన ట్రిబ్యునల్ కోర్టు మెంబర్



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హనుమకొండలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వృద్ధుల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్, లైబ్రరీ పనితీరును ఆమె సమగ్రంగా పరిశీలించారు. న్యాయ సలహాలు, సూచనల కోసం ఎంత మంది వృద్ధులు కేంద్రానికి వస్తున్నారు? కోర్టుకు ఎన్ని కేసులు వచ్చాయి? కౌన్సెలింగ్‌కు ఎంత మంది హాజరవుతున్నారనే వివరాలను డాక్టర్ అనితా రెడ్డి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డే కేర్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, ఉచిత న్యాయ సహాయ కేంద్రాల సేవలను జిల్లాలోని వయోవృద్ధులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వృద్ధులకు ఓ వరమని పేర్కొంటూ, జిల్లాలో ట్రిబ్యునల్ పనిచేస్తున్న తీరును వివరించారు.ముమ్ముందు కూడా వయోవృద్ధుల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ట్రిబ్యునల్ కోర్టు ద్వారా మెరుగైన సేవలు అందిస్తూ, 'సీనియర్ సిటిజన్స్ చట్టం'పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అన్ని శాఖల సహకారంతో వృద్ధుల సంక్షేమం కోసం పాటుపడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు డాక్టర్ ఉష, ఉమ, డే కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు

దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ : మండల కేంద్రంలోని సింగరాజుపల్లి గ్రామం లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో



స్థానిక సర్పంచ్, చందు, బీఆర్ఎస్ నాయకులు జాకీర్ ఆలీ, కమలాకర్, పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, అక్టోబర్ 28, 2026

విపత్తుల్లో ప్రాణాలు కాపాడేవారే నిజమైన 'ఆపద మిత్రులు'

- 4వ బెటాలియన్ ఆవరణలో 'యువ ఆపద మిత్ర' శిక్షణ ప్రారంభం
- ప్రారంభించిన కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు




మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వరంగల్ మామునూరులోని 4వ బెటాలియన్ ఆవరణలో రెండవ బ్యాచ్ 'యువ ఆపద మిత్ర' శిక్షణ కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణా శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ



సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాలు సంభవించినప్పుడు మొదటి 'గోల్డెన్ అవర్'లో స్పందించే స్థానిక యువతకు సరైన సాంకేతిక శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 7 రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక శిక్షణలో వరంగల్‌కు చెందిన 112 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విపత్తు నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకుని సమాజానికి రక్షకులుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ శిక్షణలో ఎంపిక చేసిన వాలంటీర్లకు ప్రథమ చికిత్స, సీపీఆర్, ఈత, అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో ప్రాణాలను ఎలా కాపాడాలో నిపుణులచే ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. విపత్తు సమయాల్లో భయాందోళనలకు గురికాకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పద్ధతులపై లైవ్ డెమోలు నిర్వహిస్తామని తెలిపారు. వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులతో పాటు విపత్తు రక్షణ కిట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి.వంశీ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్లు రవి, వెంకటేశ్వర్లు, కృష్ణ, బెటాలియన్ పోలీస్ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.

5వ డివిజన్‌లో ముమ్మరంగా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

- ఇంటింటికీ తిరిగి దరఖాస్తులు స్వీకరించిన బీఆర్ఎస్ నాయకులు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాలతో కార్యక్రమం



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండలోని 5వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ముమ్మరంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు, 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో, డివిజన్ ఇన్‌ఛార్జ్ కుసుమ లక్ష్మీనారాయణ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ వీధుల్లో నాయకులు ఇంటింటికీ తిరిగి అర్హులైన పట్టభద్రుల నుంచి ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తు (ఫామ్)లను స్వీకరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పండగ సాగర్, దాసరి సమ్మయ్య, అరవింద్, నారాయణ, గిరి, రాజు, తాడిశెట్టి మహేష్, ప్రభాకర్, తాడిశెట్టి అనిల్, సోషల్ మీడియా ప్రతినిధి విశాల్, తాడిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

జల్, జంగల్, జమీన్ నినాద స్ఫూర్తి

- గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గోండు బెబ్బులి కొమురం భీమ్
- న్యూ అర్బన్ కాలనీ పాఠశాలలో 86వ వర్ధంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ గిరిజన విప్లవ యోధుడు, అడవి బిడ్డల హక్కుల కోసం నిజాం నవాబుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి కొమురం భీమ్ 86వ వర్ధంతి వేడుకలను వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం సంకేపల్లి గ్రామంలో 1901 అక్టోబర్ 22న జన్మించిన భీమ్, చిన్నతనంలోనే అటవీ అధికారుల దౌర్జన్యానికి తండ్రిని కోల్పోయి అడవుల్లో పెరిగాడని తెలిపారు. నిజాం రాజుల కాలంలో గిరిజనులపై జరిగిన పన్నుల దోపిడీకి, అటవీ హక్కుల కాలరాచివేతకు వ్యతిరేకంగా గోండులను సంఘటితం చేశారని గుర్తుచేశారు. కొమురం భీమ్ ఇచ్చిన "జల్, జంగల్, జమీన్" (నీరు, అడవి, భూమి) నినాదం అడవి వనరులపై ఆదివాసీల పూర్తి హక్కును చాటిచెప్పిందని పేర్కొన్నారు. 12 గిరిజన గ్రామాల స్వపరిపాలన కోసం పోరాడుతూ 1940 అక్టోబర్ 27న జోడేఘాట్ అడవుల్లో నిజాం సైన్యంతో జరిగిన వీరోచిత పోరులో భీమ్ అమరుడయ్యారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలకు



గుర్తుగా ఆసిఫాబాద్ జిల్లాకు 'కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా'గా నామకరణం చేయడంతో పాటు జోడేఘాట్‌లో స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేసిందని, అల్లాణి శ్రీధర్ దర్శకత్వంలో ఆయన జీవిత చరిత్రపై సినిమా కూడా వచ్చిందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి యువతకు స్ఫూర్తి మంతెన మణికుమార్ సేవలు

- పుస్తకాల విరాళంతో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుని పుట్టినరోజు వేడుకలు
- ధర్మకంచ పాఠశాల గ్రంథాలయానికి 65 మహనీయుల చరిత్ర పుస్తకాలు అందజేత



జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం వినూత్నంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. జనగామ పట్టణంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి విద్యార్థుల విజ్ఞానార్థం 65 మంది మహనీయుల చరిత్రలు కలిగిన పుస్తకాలను అందజేసి, జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) కనకయ్య మాట్లాడుతూ.. పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు పోకుండా పాఠశాల గ్రంథాలయానికి ఉపయోగకరమైన పుస్తకాలను విరాళంగా ఇవ్వడం అభినందనీయమని, ఇది నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజ్ మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా గడిచిన 12 సంవత్సరాలుగా అమ్మ ఫౌండేషన్ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. అన్నదానం, విద్యాదానం, రక్తదానంతో పాటు సమాజంలో సమస్యల పరిష్కారం, పట్టణాభివృద్ధే లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తోందని పేర్కొంటూ మంతెన మణికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనిత, నిర్మల, కరుణ, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, కవి–రచయిత రామ సిద్ధార్థ, భోగ బింగి నరసింహులు, మంద సాయి, సిద్దిరాల నవీన్, సిద్దిరాల చందు, సాయి తేజ్, పిట్టల కృష్ణ, తుంగ సతీష్, బొల్లం కనకరాజు, కొయ్యడ విశ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరు ప్రజాస్వామ్య కాపలాదారుడే

- ఆచార్య సురేష్ లాల్
- కేయూ దూరవిద్య కేంద్రంలో ఓటరు చైతన్య సదస్సు
- ప్రలోభాలకు లొంగకుండా ఆత్మసాక్షిగా ఓటు వేయాలని పిలుపు

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రతి ఓటరు కూడా ప్రజాస్వామ్యాన్ని రక్షించే కాపలాదారుడని కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి.సురేష్ లాల్ పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం ఆవరణలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ఓటరు చైతన్య కార్యక్రమానికి' ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.



ఈ సందర్భంగా ఆచార్య సురేష్ లాల్ మాట్లాడుతూ.. ఓటు అనేది సమాజంలో మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దానిని నాణ్యమైన అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. "ఓటుతో అధికారాన్ని నిలబెట్టవచ్చు లేదా కూలదోయవచ్చు. బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలంటే ఆత్మసాక్షిగా ఓటు వేయాలి. ఓటును అమ్ముకోకుండా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీ కలిగిన వ్యక్తులను గెలిపించుకోవాలి" అని పిలుపునిచ్చారు. కేయూ జర్నలిజం శాఖ విభాగాధిపతి, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం ప్రతి ఒక్కరూ బీఎల్ఓలకు వివరాలు అందజేసి ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. అలాగే త్వరలో జరగబోయే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు డిప్లమా, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తిరిగి ఓటరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడే ప్రకాష్, గీసుగొండ సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్, డాక్టర్ వంగాల సుధాకర్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, అక్టోబర్ 28, 2026

రక్తహీనత నివారణే ప్రధాన లక్ష్యం

హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశం

'అనీమియా ముక్త్ భారత్'పై వైద్యాధికారులకు అవగాహన సదస్సు

బస్తీ దవాఖానాల్లో హెచ్‌బీ పరీక్షలు, పూర్తిస్థాయి చికిత్స అందించాలి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సికింద్రాబాద్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్యాధికారులకు 'అనీమియా ముక్త్ భారత్ అభియాన్'పై ప్రత్యేక వర్క్‌షాప్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్యాధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న 'అనీమియా ముక్త్ భారత్' ద్వారా పిల్లలు, కౌమార దశ బాలబాలికలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనతను తగ్గించి ఆరోగ్య పరిరక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలకు వచ్చే ప్రతి గర్భిణీకి తప్పనిసరిగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, తీవ్రతను బట్టి చికిత్స అందించాలని, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని ఆదేశించారు. అన్ని రకాల రక్తహీనతలకు కేవలం ఐరన్ మాత్రలే పరిష్కారం కాదని, మలేరియా, తలసేమియా వంటి ఇతర ఆరోగ్య సమస్యలు లేదా పోషకాహార లోపాల వల్ల రక్తహీనత వస్తుందో లేదో గుర్తించి సరైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఐఎఫ్ఏ మాత్రల వినియోగం, పోషకాహారం, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ సిబ్బంది గృహ సందర్శనలు చేస్తూ ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. దవాఖానాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనిత, డాక్టర్ సాయిబాబా, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ మనోజ్, డాక్టర్ విశాల్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ డంప్ యార్డు తొలగించే వరకు పోరాటం ఆపేది లేదు

- ఎంపీ ఈటల రాజేందర్
- ఎదులాబాద్ బహిరంగ సభలో తీవ్ర ఆగ్రహం
- రూ.3 వేల కోట్లతో డీపీఆర్ తయారు చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఎదులాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ పాదయాత్ర ప్రారంభ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత 12 ఏళ్లుగా స్థానిక ప్రజలు జెఎసిగా ఏర్పడి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారని, నిబంధనలు పాటించనందుకు సుప్రీంకోర్టు రూ. లక్ష ఫైన్ కూడా వేసిందని ఈటల గుర్తుచేశారు. "గతంలో ఇక్కడ ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఎన్జీటీ, సుప్రీంకోర్టుల్లో కేసులు వేశారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించాం. కానీ రెండేళ్లయినా ఎలాంటి స్పందన లేదు" అని విమర్శించారు. ఈ డంప్ యార్డు వ్యవహారాన్ని తాను పార్లమెంటులో లేవనెత్తడమే కాకుండా, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో 'జీరో వేస్ట్' సాధ్యం:

రూ. 2 నుంచి 3 వేల కోట్లు వెచ్చిస్తే జవహర్ నగర్, బాలాజీ నగర్ ప్రజల బతుకులు మారతాయని ఎంపీ తెలిపారు.

ఆధునిక టెక్నాలజీతో తడి చెత్త నుంచి ఆర్గానిక్ ఎరువులు, పొడి చెత్త నుంచి విద్యుత్, ప్లాస్టిక్ వ్యర్థాలతో డాంబర్ తయారు చేయవచ్చని, ఒక్క కిలో వ్యర్థం కూడా మిగలకుండా చేసే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' భావనతో సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.3000 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు.

మృత్యుకుహరంగా ఎదులాబాద్ :

డంపింగ్ యార్డ్ వ్యర్థాల వల్ల చెరువులు విషతుల్యమై మత్స్యకారులు రోడ్డున పడ్డారని, నీళ్లు తాగిన పశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీరు, గాలి వల్ల ఎదులాబాద్‌లో పదుల సంఖ్యలో ప్రజలు క్యాన్సర్, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు పచ్చని పొలాలతో కళకళలాడిన గ్రామం నేడు మరణ మృదంగం మోగిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని కోరారు. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ పాదయాత్ర ముగింపు సందర్భంగా బాలాజీ నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఈటల తెలిపారు. తెలంగాణ ఉద్య మ స్ఫూర్తితో డంప్ యార్డ్ సమస్య తీరే వరకు బాధితులకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.





డిజిటల్ పద్ధతిలో సమగ్ర శిక్షణ

- ఛార్జ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం
- జీహెచ్ఎంసీ సర్కిళ్లు 31 నుంచి 60 పరిధిలోని అధికారులకు అవగాహన
- నాణ్యత, కచ్చితత్వంతో జనగణన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : 'భారత జనాభా గణన 2027'లో భాగంగా రెండవ దశ అయిన 'జనాభా గణన'ప్రక్రియపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31 నుండి 60 సర్కిళ్ల ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర జనాభా గణన కార్యకలాపాల డైరెక్టర్ శ్రీమతి భారతి హోళ్లికేరి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ బి.సంతోష్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణలో జనాభా గణన ప్రాముఖ్యత, అనుసరించాల్సిన పద్ధతులతో పాటు ఎన్యుమరేషన్ బ్లాకుల ఏర్పాటు, సంక్షిప్త గృహ జాబితాల తయారీ, 'సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్' పోర్టల్ మాడ్యూళ్ల పనితీరుపై సమగ్ర అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయి గణన సిబ్బంది, పర్యవేక్షకులు ఉపయోగించే 'జనాభా గణన మొబైల్ అప్లికేషన్' ద్వారా 1 నుంచి 40 ప్రశ్నలకు వివరాలను ఎలా నమోదు చేయాలో వివరించారు. అలాగే ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకునే 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ప్రక్రియను అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జనగణన డైరెక్టర్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లు మాట్లాడుతూ.. జనాభా గణన అత్యంత ముఖ్యమైన జాతీయ కార్యక్రమని, అధికారులు నిబద్ధత, కచ్చితత్వంతో తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. డేటా నాణ్యతలో ఎలాంటి లోపాలు రాకుండా, నిర్ణీత వ్యవధిలోగా క్షేత్రస్థాయి విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ ఒక్క కుటుంబం లేదా భవనం విడుదల కాకుండా, పునరావృతం కాకుండా సమగ్రంగా గణన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ జనాభా గణన కార్యాలయ జాయింట్ డైరెక్టర్, నేషనల్ ట్రైనర్ వి.శ్రీకాంత్, స్టాటిస్టికల్ ఆఫీసర్ శివ రాజులు ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు.

గురు రాందాస్ జీ ఆశయాలు ఆదర్శప్రాయం

■ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ గురు రాందాస్ జీ నగర్‌లో శ్రీ గురు రాందాస్ జీ మహారాజ్ 492వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వి. నవీన్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. గురు రాందాస్ జీ మహారాజ్ బోధించిన మానవతా విలువలు, సేవా దృక్పథం, సమానత్వం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. మహనీయులు చూపిన బాటలో నడుస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గురు రాందాస్ జీ భక్తులు, కాలనీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.